క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో మంగళవారం జిమ్స్ ఆస్పత్రి వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. మైత్రి యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని మదర్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఆవరణలో నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన 128 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 12 మందికి మెరుగైన వైద్యం కోసం ముచ్చింతల్ వద్ద ఉన్న జిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అవసరమైన వారిని గుర్తించి వారికి మందులు అందించారు. కార్యక్రమంలో జిమ్స్ ఆస్పత్రి వైద్యులు రఘునందన్, మృదుల, సల్మాన్‌తో పాటు సిబ్బంది నాయుడు, సురేష్‌గౌడ్, మైత్రి యువజన సంఘం అధ్యక్షులు మనోహర్‌గౌడ్, మల్లేశ్, ఆనంద్, రాఘవేందర్, శ్రీకాంత్, కృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

మండల పశువైద్యాధికారి అహ్మద్



ముర్తుజాగూడలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

మొయినాబాద్‌రూరల్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు రైతులు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని ముర్తుజాగూడ గ్రామంలో గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేసి, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయక సిబ్బంది ప్రసన్నకుమార్, భీమ్‌రావు, గోరె మీయా తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

ఆమనగల్లు: ప్రజాభీష్టానికి అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రజాపాలనలో అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం వివిధ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పార్టీ నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా పాలన సాగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మాడ్గుల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, రామకృష్ణ, బాబా, జగన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అభిషేక్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: భారత రాజ్యాంగాన్ని రక్షించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు గౌని బాల్‌రాజ్ అధ్యక్షతన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అభిషేక్‌రెడ్డి హాజరై కొంగరకలాన్‌లో అంబేడ్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగం వల్లే ప్రజల బతుకులు బాగుపడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు మహిపాల్, లక్ష్మీపతిగౌడ్ మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు శివకుమార్, వెంకటేశ్వర్లు, యాదగిరి, శంకర్‌గౌడ్, దాసు, రాజు, కృష్ణారెడ్డి, అయిలయ్య, లక్కరాజు ప్రశాంత్, ప్రవీణ్‌గౌడ్, శేఖర్, నర్సింహ, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

భూసమస్యలు తీరేనా?

- అధికారుల తప్పిదం.. రైతన్నలకు శాపం
- దేవుడి పేరుతో నిషేధిత జాబితాలో చేరిన పట్టా భూములు
- ధరణి సమయంలో పొరపాటుతో అన్నదాతల అవస్థలు
- నేడు కొందుర్గులో భూభారతిపై అవగాహన సదస్సు



కొందుర్గు తహసీల్దార్ కార్యాలయం

కొందుర్గు: అధికారులు చేసిన తప్పిదం కొందుర్గు మండలం చెర్కుపల్లి గ్రామ రైతులకు శాపంగా మారింది. 1954 సంవత్సరం ఖాస్రా పహణి రికార్డుల ప్రకారం చెర్కుపల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 119, 260, 271, 272, 274, 277, 280, 281, 282, 295లలో 79 ఎకరాల విస్తీర్ణం భూమి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పేరున పట్టా ఉంది. అయితే ప్రభుత్వం 1958లో గ్రామంలోని భూములను రీ సర్వే చేసింది. కానీ రీ సర్వే ప్రకారం గ్రామ శివారులోని 1, 2, 4, 12, 67, 100, 107, 108, 146, 147, 148, 158, 159, 172, 318, 348, 252, 354, 357, 358, 359లలో విస్తీర్ణం 79 ఎకరాల భూమిని శ్రీవేంకటేశ్వరస్వామి పేరున పట్టా ఉన్నట్లు ప్రకటించారు.

ధరణి పోర్టల్ సమయంలో జరిగిన పొరపాటు

అధికారులు ధరణి పోర్టల్ ఏర్పాటు చేసే సమయంలో రీ సర్వేకు ముందు ఉన్న సర్వే నెంబర్లలోని 79 ఎకరాలు, రీ సర్వే తదుపరి ప్రకటించిన సర్వే నెంబర్లలోని 79 ఎకరాలు మొత్తం 158 ఎకరాల భూమిని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించినదిగా చూపుతూ నిషేధిత జాబితాలో చేర్చారు. అయితే వాస్తవానికి 79 ఎకరాలు మాత్రమే దేవాలయానికి ఉండాలి. కానీ 158 ఎకరాలు దేవాలయానికి చూపడంతో గ్రామానికి చెందిన 48 మంది రైతులు తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత రైతులు తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం దక్కడం లేదు. కనీసం భూభారతితోనైనా తమ సమస్యలు తీరుతాయేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించడానికి కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం కొందుర్గు మండల కేంద్రానికి రానున్నట్లు సమాచారం రావడంతో రైతన్నలు మరింత ఆశలు పెంచుకుంటున్నారు. ఇక కలెక్టర్ ఈ విషయమై ఎలా స్పందిస్తారో.. రైతన్నల బాధలు తీరేదెప్పుడో వేచి చూడాల్సిందే.

తూర్పు, పడమర..

కొందుర్గు మండల కేంద్రాన్ని కొందుర్గు తూర్పు, పడమర రెండు రెవెన్యూ గ్రామాలుగా విభజించారు. అయితే కొందుర్గు సర్వే నెంబర్ 70, 76, 77 తదితర సర్వే నంబర్లలో విస్తీర్ణం భూమి వక్ఫ్‌కు చెందినదిగా వక్ఫ్ గెజిట్ ఉత్తర్వులు ఉన్నాయి. కానీ కొందుర్గు తూర్పు, పడమర అంటూ లేకపోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. దీంతో కొందుర్గు తూర్పు, కొందుర్గు పడమర గ్రామ శివారుల్లోని 70, 76, 77 తదితర సర్వే నంబర్లలోని భూములన్నీ నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో ఆయా సర్వే నంబర్లలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సచ్చినా సమస్య తీరేలా లేదు



మా తాతల నుంచి వస్తున్న పట్టా భూములు సాగుచేసుకొని బతుకుతున్నాం. అయితే మాకు ఏమైనా ఆపద వచ్చి ఓ గుంట భూమిని అమ్ముకుందామని వెళ్తే మీ భూములు దేవుడి పేరున ఉన్నాయి.. అమ్మడానికి వీలు కాదు.. అంటూ అధికారులు చెబుతున్నారు. మేము సచ్చినా సమస్య తీరేలా లేవు.

–వడ్డె చంద్రయ్య, రైతు, గంగన్నగూడ

మా పరిధిలో లేదు



ఎండోమెంట్, వక్ఫ్ భూములకు సంబంధించి మార్పులు, చేర్పులు చేయడానికి మా పరిధిలో ఎలాంటి అధికారాలు లేవు. రైతుల భూములు వక్ఫ్, ఎండోమెంట్ జాబితాలో చేరాయని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. వక్ఫ్, ఎండోమెంట్ శాఖ వారు క్లియరెన్స్ ఇచ్చేంతవరకు సమస్య తీరదు.

–రమేశ్‌కుమార్, తహసీల్దార్

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్ వార్డులో రూ.10లక్షల (ఎమ్మెల్యే ఎస్సీ సబ్‌ప్లాన్) నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను మంగళవారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మర్పల్లి జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు మాలతి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ బి.యాదిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గావ్ చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ నాయకులు జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ, రేషన్ దుకాణాలను సందర్శించి వివరాలు సేకరించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారానే లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందుతున్నాయని తెలిపారు. ప్రతీ గ్రామ పంచాయతీకి అందించే సంక్షేమ పథకాలు కేంద్రం నిధులతోనే అమలు అవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు కుర్మయ్య, ప్రశాంత్, యాదయ్య, శ్రావన్, శివకుమార్, వితలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయపాలనేదీ?

- పీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు
- వైద్యులు లేకపోవడంతో రోగులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



వైద్యురాలు, సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కేశంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మల్లాంకర్ శివాజీ అన్నారు. మంగళవారం అనారోగ్యంగా ఉండటంతో ఆస్పత్రికి వెళ్లినట్టు ఆయన తెలిపారు. సాయంత్రం మూడు గంటలకే ఆస్పత్రిలో వైద్యురాలు, సిబ్బంది లేరని ఆయన ఆరోపించారు. వైద్యురాలితో పాటుగా కొంతమంది సిబ్బంది హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, వారు సమయానికి రావడం లేదని పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బస్సు వచ్చిన సమయానికే రావడం, మళ్లీ బస్సులు వెళ్లే సమయానికే వెళ్లడం ప్రతిదినం పారిపాటిగా మారిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు గతంలో ప్రభుత్వ ఆస్పత్రికే వచ్చేవారని, ప్రస్తుతం వైద్యురాలు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో రోగుల సంఖ్య తగ్గిందని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బయోమెట్రిక్ లేదా ఫేస్ రికగ్నైజర్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సేవా ఫౌండేషన్ సభ్యులు

శంకర్‌పల్లి: ఎండాకాలం దృష్ట్యా ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. నర్సింహాస్వామి, మోనాచారిల పేరిట ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామని స్పష్టం చేశారు. ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు వినోద్‌రెడ్డి, రవీందర్, ఫౌండేషన్ సభ్యులు వేణేంద్రచారి, రవీందర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధునూదన్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పోలవరంతండాలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు వర్త్య మాణెమ్మ లక్ష్మణ్ దంపతులు నిర్వహించిన శ్రీకృష్ణ 21వ వార్షికోత్సవ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇష్ట దైవాన్ని పూజించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని దేవుడికి కేటాయించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్‌ను మాజీ ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు సుభాష్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, రాఘవేందర్, దయాకర్, సూర్య, రఫీక్, బాల్యానాయక్, కిషోర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి

షాద్‌నగర్: విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న కృషి ఎనలేనిదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను మంగళవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాతల సహకారంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తుండటం హర్షణీయమన్నారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారని, అదేవిధంగా కళాశాలకు ఫర్నిచర్, క్రీడా సామగ్రి సమకూర్చారన్నారు. కళాశాలలో 71.6శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేత తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు ఫలితాలు సాధించడం హర్షణీయమన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కరుణ, షామిలి, ఉమా, అరుంధతి, కిరణ్, శ్రీదేవి, జ్యోతి, రాజు, ఆయాజ్ అలీ, జ్ఞానేశ్వర్, లక్ష్మీ, బాలశ్రీ, భాస్కర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ దేవాలయంలో పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: చైత్రమాసాన్ని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్‌లోని 12వ వార్డు వివేకానంద కాలనీలో ఉన్న పోచమ్మ దేవాలయంలో మంగళవారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి వెండి ఆభరణాలు ముక్కుపుడక, బొట్టు, కళ్లు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, మాజీ కౌన్సిలర్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు ప్రదీప్, రఘుమారెడ్డి, ముత్యాలు, కైలాస్‌నాథ్, ప్రసాద్, కుమార్, శ్రీశైలం, విజయ్, నరేశ్, తేజ, సుదర్శన్, సంతోష్, రవి, సురేష్, సాయి, కృష్ణ, నరేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కొందుర్గు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ.2320ల మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే రైతులు ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రవాణా, హమాలీ, గోనె సంచుల కొరత రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించాలని, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో రైతులు ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్లు బక్కన్నయాదవ్, దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్లు మల్లేశ్, కరుణాకర్, భాస్కర్, నవీన్, భరత్, రవినాయక్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, కుమారస్వామి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, రఘునందన్ పాల్గొన్నారు.

కేసీఆర్‌పై విమర్శలు సరికాదు




మాట్లాడుతున్న నాయకులు

కొందుర్గు: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసిన మహనీయుడు కేసీఆర్ అని, అలాంటి నాయకుడిని విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని, ఆమె దేవత అని కాంగ్రెస్ నాయకులు అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ తెలంగాణ జాతిపిత అని, ఆయనపై విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాములు, బాబురావు, జబ్బార్, సత్యప్రమోద్‌రావు, నర్సింగ్‌రావు, మానయ్య, గణేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రేమ్‌రాజ్

షాద్‌నగర్: బూత్‌స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రేమ్‌రాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో షాద్‌నగర్ మున్సిపాలిటీ, ఫరూఖ్‌నగర్ మండల బీజేపీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పార్టీ బీజేపీ అన్నారు. ప్రధాని మోదీ ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు ముందుండాలని, తద్వారా పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం అవుతుందన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాషాయ జెండా ఎగరాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, ప్యాట అశోక్, మురళి, ప్రశాంత్, రుషికేష్, వెంకటేశ్, హరిభూషణ్, సురేష్, గణేశ్, కుర్మయ్య, నర్సింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రేమ్‌రాజ్